క్లుప్తంగా

జర భద్రం ప్రయాణికులారా..!



పెచ్చులూడుతున్న గడివేముల ఆర్టీసీ బస్టాండ్

గడివేముల: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ భవనం శిథిలావస్థకు చేరుకుంది. స్లాబు దెబ్బతినడంతో పెచ్చులూడి పడుతోంది. దీంతో ప్రయాణికులు బస్టాండులోకి రావాలంటే ఎక్కడ పెచ్చులు మీదపడతాయోనని భయాందోళన చెందుతున్నారు. బయట ఉన్న చెట్ల కిందనే బస్సుల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి భవనాన్ని మరమ్మతులు చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం

కల్లూరు: సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. శనివారం చిన్నటేకూరులో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి హాజరై లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేసి మాట్లాడారు. ఏపీ అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, ఎంపీడీఓ నాగేశాచలరెడ్డి, నాయకులు మాదేష్, శేషగిరి, రమణ పాల్గొన్నారు.

లక్ష డప్పుల కార్యక్రమాన్ని జయప్రదం చేయండి



తమ్మరాజుపల్లెలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పాణ్యం: ఎస్సీ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఈనెల 7వ తేదీ జరిగే లక్ష డప్పుల కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. శనివారం తమ్మరాజుపల్లెలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు సురేంద్ర, క్రిష్ణస్వామి మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. ఇటీవల మందక్రిష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున గుప్తా

పాణ్యం: మండల కేంద్రంలోని ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో బస్సు డ్రైవర్లకు రోడ్డు సెఫ్టీపై శనివారం అవగాహన కల్పించారు. నంద్యాల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మల్లిఖార్జున గుప్తా మాట్లాడారు. కాలేజీ బస్సుల్లో జీపీఎస్ డ్యాష్ క్యామ్, సీసీటీవీ కెమెరాలు అమర్చడం ఎంతో అవసమన్నారు. ప్రమాద సమయాల్లో ఇందులో నమోదయ్యే వీడియోలు ఆధారాలుగా మారుతాయని తెలిపారు. డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. పరిమితికి మించి వేగం వెళ్లకూడదన్నారు. కార్యక్రమంలో కళాశాల డీన్ ఆశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్, రవాణశాఖ అధికారి శ్రీకాంత్, హెచ్ఓడీ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న బెటాలియన్ కమాండెంట్ ప్రభుకుమార్, అసోసియేషన్ సభ్యులు

కర్నూలు : ఏపీఎస్పీ కర్నూలు రెండవ పటాలం పోలీసు అధికారుల సంఘం 2025 క్యాలెండర్, డైరీని కమాండెంట్ ప్రభుకుమార్ ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షుడు పెద్దన్న, ప్రధాన కార్యదర్శి బీఎస్ హరిశ్చంద్రుడు, అసోసియేషన్ సభ్యులతో కలసి శనివారం పటాలంలోని కమాండెంట్ కార్యాలయంలో ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. అడిషనల్ కమాండెంట్ నాగేంద్రరావు, అసిస్టెంట్ కమాండెంట్లు ఎస్ఎం బాషా, ఎస్‌కే షఫృద్దిన్, డీఎస్పీ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు 'వసంత పంచమి' వేడుకలు

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో వసంత పంచమి వేడుకలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. లలితా సుందరేశ్వరిని సరస్వతీ మాతగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పిస్తామని తెలిపారు. విద్యార్థులు, భక్తులతో అష్టోత్తర పూజ, అక్షరాభ్యాసం కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు.

ఏడి 'పింఛన్'

- పింఛన్ల కోసం వృద్ధుల పడిగాపులు



పింఛన్ల కోసం కోడుమూరు సచివాలయం వద్ద పడిగాపులు కాస్తున్న వృద్ధులు

కోడుమూరు రూరల్: జగనన్న హయాంలో తెలవారకముందే ఇళ్ల వద్దకు పింఛన్ డబ్బులొచ్చేవి. కూటమి ప్రభుత్వం వలంటరీ వ్యవస్థను పక్కనపెట్టి గ్రామ సచివాలయ సిబ్బందితో పంపిణీ చేస్తుండటంతో లబ్ధిదారులకు పడిగాపులు తప్పడం లేదు. సచివాలయ సిబ్బందిలో కొందరు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లకుండా ఒక చోట గుంపుగా కూర్చోబెట్టి పింఛన్లు ఇస్తుండగా, మరికొందరు ఒకరిద్దరికి పింఛన్లు ఇచ్చి మిగిలిన వారు గ్రామ సచివాలయం వద్దకు రమ్మని చెప్పి వెళ్లిపోతుండటంతో వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శనివారం కోడుమూరులోని సచివాలయం -4, 5లకు సిబ్బంది ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు ఇవ్వకపోవడంతో వృద్ధులే సచివాలయాల వద్దకు వెళ్లి పింఛన్ డబ్బు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వృద్ధులు మాట్లాడుతూ జగనన్న పాలనలోనే పింఛన్ల పంపిణీ బాగుండేదని, ఎంత సమయమైనా వలంటరీలు ఇంటి వద్దకు వచ్చి పింఛన్లు ఇచ్చి వెళ్లే వారని, నేడు ఆ పరిస్థితి లేదని వాపోయారు.



సూదిరెడ్డి పల్లెలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

ముందుకు సాగని పింఛన్ పంపిణీ

సి.బెళగల్: మండలంలో పింఛన్ పొందేందుకు లబ్ధిదారులు, పంపిణీ అధికారులు తీవ్ర అవస్థలు పడ్డారు. శనివారం ఉదయం 6 నుంచి కొంతమంది అధికారులు పింఛన్ పంచేందుకు గ్రామాలకు చేరుకున్నారు. అయితే ఒకరిద్దరికి పింఛన్ పంచిన అనంతరం సర్వర్ మొరాయించడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు పింఛన్ల కోసం పడిగాపులు కాశారు. ఎట్టకేలకు ఉదయం 9.20 గంటల తర్వాత సర్వర్ అందుబాటుకి రావడం, మధ్యాహ్నం అనంతరం పంపిణీ అవరోధాలు తగ్గడంతో మొదటి రోజు 92 శాతం పంపిణీ పూర్తి చేశారు.

సూదిరెడ్డిపల్లెలో..

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని సూదిరెడ్డి పల్లె గ్రామంలో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి శనివారం పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్ సొమ్మును అవ్వ, తాతలు, దివ్యాంగులు, వితంతువులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలోని పలు అభివృద్ధి పనులకు భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ శీలమ్మ, ఎంపీడీఓ రఘునాథ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పాణ్యం: స్థానిక డిగ్రీ కళాశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శివారెడ్డి తెలిపారు. గంటకు రూ. 400 చొప్పు న వేతనం చెల్లిస్తామన్నారు. ఎంపీఈడీ కోర్సులో 55 శా తం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హుల న్నారు. పీహెచ్‌డీ, నెట్ పాసైన అభ్యర్థులకు ప్రాధాన్య త ఉంటుందన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 5వ తేదీ కళాశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఉద్యోగులు విధులను సక్రమంగా నిర్వహించాలి

సి.బెళగల్: గ్రామ సచివాలయాల ఉద్యోగులు విధులను సక్రమంగా నిర్వర్తించాలని ఈఓఆర్డీ ఈశ్వరయ్యస్వామి సూచించారు. శనివారం ఆయన కంబదహాల్ గ్రామంలో చేపట్టిన పింఛన్ల పంపిణీని పరిశీలించారు. అనంతరం సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు, పలు సర్వేల నివేదికలు, రికార్డులు పరిశీలించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత తప్పనిసరి



విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలిస్తున్న ఎంఈఓ ఓంకార్ యాదవ్

ఓర్వకల్లు: విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంఈఓ ఓంకార్ యాదవ్ వంట ఏజెన్సీలకు సూచించారు. శనివారం మండలంలోని పూడిచెర్ల ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాలకు హాజరైన విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల హాజరు శాతం పరిశీలించారు. మధ్యాహ్న భోజన రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని ఆయా పాఠశాలల హెచ్ఎంలకు సూచించారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలు విజయలక్ష్మి, శైలజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మురుగు కాలువలు నిర్మించాలి

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని జి.సింగావరం గ్రామంలో మురుగు కాలువలు నిర్మించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర కోరారు. శనివారం పంచాయతీ కార్యదర్శి సలోమీకి వినతి పత్రం అందజేశారు. గ్రామంలో మురుగు కాలువలు లేకపోవడంతో మురుగు నీరు రోడ్లపైకి చేరి ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారని వివరించారు. పరిసరాలు అపరిశుభ్రంగా మారి దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారని వెంటనే మురుగు కాలువలు నిర్మించి సమస్యను పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో డీవైఎఫ్ఐ నాయకులు సురేష్, వంశీ, గురు ప్రసాద్, శశి, బాషా ఉన్నారు.



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

వ్యాయామంతో రక్తపోటు దూరం

కోడుమూరు రూరల్: ప్రతి రోజు వ్యాయామం, సరైన ఆహారపు అలవాట్ల ద్వారా రక్తపోటుకు దూరంగా ఉండవచ్చని జిల్లా సంచార చికిత్స కార్యక్రమ నోడలాఫీసర్ డాక్టర్ రఘు సూచించారు. శనివారం లద్దగిరి పీహెచ్‌సీ పరిధిలోని రామాపురం గ్రామంలో జరుగుతున్న సంచార చికిత్స కార్యక్రమాన్ని తనిఖీ చేసి ప్రజలకందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తపోటును ఎప్పటికప్పుడు పరీక్షించుకుంటూ ఉండాలన్నారు. ఆహారంలో ఉప్పు తక్కువగా ఉండేలా చూసుకోవడం, మద్యపానం, ధూమపానం, కొవ్వు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రతి రోజు వ్యాయామం చేయడం ద్వారా, పాలు, గుడ్లు, ఆకు కూరలతో పాటు, మంచి పోషకాలుండే ఆహారాలను తీసుకోవడం ద్వారా రక్తపోటును నివారించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్యులు భాస్కర్, ఆరోగ్య అధికారి శాంత, ఆరోగ్య, ఆశా సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య సేవలను పరిశీలిస్తున్న జిల్లా సంచార చికిత్స కార్యక్రమం నోడలాఫీసర్ డాక్టర్ రఘు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

- సమయానికి రాని అంబులెన్స్
- అరగంట పాటు రోడ్డుపైనే క్షతగాత్రులు

పాణ్యం: మండల పరిధిలోని బలపనూరు–శాంతిరామ్ ఆస్పత్రి మధ్య జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. నంద్యాలకు చెందిన రమేష్, గడిగరేవుకు చెందిన వెంకటరమణ ప్రైవేట్ విత్తన కంపెనీలో పని చేస్తున్నారు. శనివారం ఓ పని నిమిత్తం పాణ్యం వచ్చి మధ్యాహ్నం బైక్‌పై తిరుగు ప్రయాణమయ్యారు. శాంతిరామ్ ఆస్పత్రి సమీపంలో జరుగుతున్న పవర్‌గ్రిడ్ పనులకు నీరు తీసుకెళ్తున్న ట్యాంకర్ హఠాత్తుగా ఎడమవైపు తిరగడంతో వెనుక నుంచి వస్తున్న బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో రమేష్, వెంకటరమణకు గాయాలయ్యాయి. వాహనదారులు అంబులెన్స్‌కు కాల్ చేసినా రాకపోవడంతో అరగంట పాటు రోడ్డుపైనే క్షతగాత్రులు సహాయం కోసం ఎదురుచూశారు. ఆ తర్వాత రమేష్‌ను బైక్‌పై తీసుకెళ్లి శాంతిరామ్ ఆస్పత్రిలో చేర్పించారు. వెంకటరమణను హైవే అంబులెన్స్‌లో శాంతిరామ్‌కు తరలించారు.



గాయపడిన రమేష్



వెంకటరమణ



ప్రమాద స్థలి వద్ద గుమిగూడిన ప్రజలు

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

- డీఈఓ శామ్యూల్‌పాల్

కోడుమూరు రూరల్: పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని డీఈఓ శామ్యూల్‌పాల్ ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం స్థానిక బాలికల హైస్కూల్‌ను డీఈఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల రికార్డులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. కాసేపు విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షలంటే భయం వీడాలని సూచించారు. సమయం చాలా ఉందని, ప్రణాళిక ప్రకారం చదువుకుంటే విజయం సులభమవతుందని చెప్పారు. అనంతరం ఉపాధ్యాయులతో డీఈఓ సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ప్రతి సబ్జెక్టులోనూ మంచి మార్కులు వచ్చేలా కృషి చేయాలన్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతుల ద్వారా సులువైన పద్ధతిలో బోధించి ప్రతి విద్యార్థి పాసయ్యేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగరాజకుమారి ఉన్నారు.



పది ఫలితాలపై ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీఈఓ శామ్యూల్‌పాల్

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి

సి.బెళగల్: మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని మండల ప్రత్యేకాధికారిణి, జిల్లా మత్స్యశాఖ డీడీ శ్యామల నిర్వాహకులకు సూచించారు. శనివారం ఆమె ఎంపీడీఓ రాణెమ్మతో కలిసి మోడల్ స్కూల్‌ను తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను, తరగతి గదులను శుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. టీచర్లతో సమావేశమైన పలు సూచనలు చేశారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో సమావేశమై పాఠ్యాంశాలలోని విషయంపై పూర్తి అవగాహన పెంచుకోవాలని, భయం వీడి పరీక్షల్లో ఉత్తీర్ణతే లక్ష్యంగా చదవాలని సూచించారు. విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం నాణ్యతగా లేకపోవడం, తాగు నీరు అందుబాటులో లేకపోవడం, హాస్టల్ పరిసరాలు శుభ్రంగా లేకపోవడంతో సిబ్బందిపై డీడీ మండిపడ్డారు. పద్ధతి మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సచివాలయ ఉద్యోగులు చేపట్టిన పింఛన్ పంపిణీ, గోకులం షెడ్ల నిర్మాణాలను పరిశీలించారు.



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న డీడీ శ్యామల, ఎంపీడీఓ రాణెమ్మ

శిథిలావస్థలో చెరువులు

- దెబ్బతిన్న ఫీడర్ చానల్స్
- ఆయకట్టుకు చేరని నీరు
- మరమ్మతులపై దృష్టి సారించని అధికారులు



పాణ్యంలో దెబ్బతిన్న ఊరుముందరి చెరువు అలుగు



దెబ్బతిన్న బండ్

పాణ్యం: మండలంలో చిన్ననీటి పారుదలశాఖ పరిధిలోని చెరువులు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. చెరువుల తూములు మరమ్మతులకు గురికావడం, నీటి లీకేజీ, బండ్ దెబ్బతినడంతో చెరువుల ఆయకట్టు కింద ఉన్న సాగుభూములకు సక్రమంగా నీరు అందడం లేదు. ఫీడర్ చానళ్లు సైతం దెబ్బతిన్నాయి. చెరువుల నిర్వహణ గాలికొదిలేయడంతో కంపచెట్లు పెరిగిపోయాయి. మరికొన్ని చెరువుల్లో పూడిక తీయకపోవడంతో నీటి నిల్వ తగ్గుతోంది. ఇలాగే చెరువులను వదిలేస్తే నీటి నిల్వలు మరింత తగ్గి పరిస్థితి దారుణంగా తయారవుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాదైనా చెరువులను బాగు చేయాలని కోరుతున్నారు.

మండలంలో చిన్ననీటి పారుదల చెరువుల వివరాలు

చెరువు పేరు	నీటి నిల్వ (ఎంఎఫ్‌టీసీ)	ఆయకట్టు ఎకరాలు	విస్తీర్ణం (వదరపు కి.మీ)
కొండజూటూరు	120.07	208.08	0.609
వద్దుగండ్ల	45.91	127	0.1867
ఆలమూరు	74.87	172.59	0.240
కొల్లమాకుల రిజర్వాయర్	84.76	200	0.712
పాణ్యం ఊరుముందరి చెరువు	22.95	327.75	0.4246
భూపనపాడు	32.70	450	0.781

ప్రతిపాదనలు పంపాం

మండలంలోని అన్ని చెరువులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదకను తయారు చేశాం. అధికంగా తూములు, బండ్, జంగిల్ క్లియరెన్స్, ఫీడర్ చానళ్ల సమస్యలు ఉన్నాయి. సుమారు రూ. కోటి వరకు ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించాం. అనుమతులు రాగానే పనులు చేపడతాం. పాణ్యం ఊరుముందరి చెరువుకు తూము, బండ్, ఫీడర్ చానళ్లు దెబ్బతిన్నట్లు గుర్తించాం. అలాగే కొండజూటూరు అలుగు, తూములు, భూపనపాడు తూము, జంగిల్ క్లియరెన్స్, ఆలమూరు చెరువుకు జంగిల్ క్లియరెన్స్, తూము, కొల్లమాకుల రిజార్వాయర్‌కు జంగిల్ క్లియరెన్స్, పూడికతీతతో పాటు ఇతర పనులను గుర్తించాం.
– నాగన్న, డీఈఈ, చిన్న నీటిపారుదల శాఖ

సారూ.. ఫాగింగ్ చేయరూ

- గ్రామాల్లో అధ్వానంగా పారిశుద్ధ్యం
- దోమలతో అల్లాడుతున్న ప్రజలు
- రోగాల బారిన పడుతున్న ప్రజలు



గడివేముల బీసీ కాలనీలో నదీ ప్రవాహాన్ని తలపిస్తున్న మురుగునీరు

గడివేముల: మండలంలో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా తయారైంది. ఫలితంగా మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో దోమలు విజృంభిస్తున్నాయి. ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. జ్వరపీడితులతో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. సాయంత్రమైతే చాలు దోమల బెడదకు ఇంటి నుంచి బయటకు రావడానికి జనం జంకుతున్నారు. దోమల నివారణకు కనీసం ఫాగింగ్ చేస్తే కొంత వరకు ఉపశమనం ఉంటుందని వాపోతున్నారు.

ఏటా పన్నులు వసూలు చేస్తున్నా..

మండల కేంద్రమైన గడివేములలో సుమారు 20 వేల జనాభా ఉన్నారు. ఏటా రూ.లక్షలాది రూపాయలు వివిధ వేలం పాటల ద్వారా, ఇంటి పన్నులు, కొళాయి పన్నుల ద్వారా వసూలు చేస్తున్నారు. అయితే మౌలిక వసతులు కల్పించడంలో మాత్రం అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు విఫలం అవుతున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. ఏ వీధి చూసినా ఏముంది గర్వకారణం అన్నట్లు.. ప్రధాన వీధులతో పాటు, శివారు ప్రాంతాలోల్ పారిశుద్ధ్య పరిస్థితి దయనీయంగా ఉంది.

రోడ్లపైనే మురుగు

చాలా చోట్ల రోడ్లపైనే మురుగు నీరు పారుతోంది. పారిశుద్ధ్య లోపంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని కాలువలైతే నెలల తరబడి పూడికతీతకు నోచుకోవడం లేదు. మురుగునీటి కాలువలు, చెత్త కుప్పలు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా దర్శనమిస్తున్నాయి. పారిశుద్ధ్య కార్మికులు గ్రామంలోని ప్రధాన రహదారుల్లో మురుగునీరు అధికంగా ఉండడంతో నడవడానికి సైతం ఇబ్బందులు పడుతున్నారు.

రోగాల బారిన పడుతున్నా..

ఖాళీ స్థలాలు, ఇళ్ల మధ్య మురుగు నిల్వ ఉండడంతో దోమలు, ఈగలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. అలాంటి ప్రదేశాల్లో దోమల మందు పిచికారీ చేయడం, నీటి నిల్వలను తొలగించడం తదితర చర్యలు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులకు తోడు.. దోమకాటుతో కొత్త రోగాలు ప్రబలుతున్నాయి. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో చిన్నారులు, జ్వరపీడితులతో నిండుకున్నాయి. ఫాగింగ్ మిషన్లు ఉన్నా వాటిని వినియోగించడం లేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. అత్యవసరమైన చోట డ్రైన్లు తీసి బ్లీచింగ్ చల్లించి.. ఫాగింగ్ చేయించాలి. వారంలో రెండు రోజులు ప్రత్యేక డ్రైవ్ చేసినా కొంత మేర దోమపోటు, పారిశుద్ధ్య సమస్య నుంచి ప్రజలకు విముక్తి కలుగుతుంది.

దోమలతో జాగ్రత్త

ఈ సమయంలో ప్రబలే వ్యాధులకు దోమలు, అపరిశుభ్రతే ప్రధాన కారణాలు. మలేరియా, ఫైలేరియా, డెంగీ, మెదుడు వాపు తదితర వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. అంతేకాకుండా అపరిశుభ్రతతో డయేరియా, టైఫాయిడ్, కామెర్లు తదితర వ్యాధులు సోకుతాయి. డెంగీ, మలేరియా వ్యాప్తికి కారణమయ్యే దోమలు మురుగు నీటిలోనే వృద్ధి చెందుతాయి. ఆవాస ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు పాటిస్తే దోమల వృద్ధిని అరికట్టవచ్చు. డయేరియా, టైఫాయిడ్, కామెర్లు అపరిశుభ్రత వాతావరణం, కలుషిత ఆహారం, తాగునీరు మూలంగానే వస్తాయి.

బేసిక్ పోలీసింగ్ తప్పనిసరి

కర్నూలు : బేసిక్ పోలీసింగ్ తప్పనిసరి... అందు కోసం నిబద్ధతతో పనిచేయాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ పోలీసు అధికారులను ఆదేశించారు. బాధ్యతలు చేపట్టిన వెంటనే శనివారం డీపీఓలోని వ్యాస్ ఆడిటోరియంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతిరోజూ సెక్షన్ల వారీగా స్టేషన్లలో రోల్‌కాల్ నిర్వహించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు పెరగడానికి ప్రధాన కారణం మద్యం సేవించి వాహనాలు నడపటమేనని, డ్రంకెన్ డ్రైవ్‌తో పాటు ఓపెన్ డ్రింకింగ్‌పై ఇకపై నిరంతరం తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. అలాగే నేరాల నియంత్రణ కోసం రాత్రి గస్తీ ముమ్మరం చేయాలని సూచించారు. సమస్యలపై స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం వాహన తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. అతివేగం, నిర్లక్ష్యం డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని, రోడ్డు నిబంధనలను ఉల్లంఘించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తూ.. చలానాలు వసూలు చేయాలన్నారు. ప్రతి కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎస్‌హెచ్‌ఓలను ఆదేశించారు. అలాగే స్టేషన్ల వారీగా సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతి అధికారి చర్యలు తీసుకోవాలని సూచించారు. సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ మహేష్ కుమార్, అడిషనల్ ఎస్పీలు హుసేన్ పీరా, కృష్ణమోహన్, డీఎస్పీలు వెంకటరామయ్య, బాబుప్రసాద్, ఉపేంద్ర బాబు, ట్రైనీ డీఎస్పీ ఉషశ్రీ పాల్గొన్నారు. అంతకుముందు జిల్లా జడ్జి కబర్ధి, డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా తదితరులను నూతన ఎస్పీ విక్రాంత్ పాటిల్ మర్యాదపూర్వకంగా కలిశారు.



కలెక్టర్‌కు మొక్కను అందిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

రేపు విధుల్లో చేరనున్న కమాండెంట్

కర్నూలు : ఏపీఎస్పీ కర్నూలు రెండో బెటాలియన్ కమాండెంట్‌గా నియమితులైన ఎం.దీపిక పాటిల్ సోమవారం విధుల్లో చేరనున్నారు. ఈ మేరకు పటాలం అధికారులు ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర వ్యాప్త బదిలీల్లో భాగంగా కాకినాడ ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్‌గా పనిచేస్తున్న ఈమెను కర్నూలు 2వ బెటాలియన్ కమాండెంట్‌గా నియమిస్తూ గత నెల 20వ తేదీ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇక్కడున్న రవికుమార్ గతేడాది సెప్టెంబర్ 30న పదవీ విరమణ పొందారు. అప్పటి నుంచి అనంతపురం 14వ బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తున్న ప్రభుకుమార్ ఇన్‌చార్జ్ కమాండెంట్‌గా వ్యవహరిస్తున్నారు.



ఎం.దీపికా పాటిల్